## 1983 ఉగాది కథానికల పోటీలో రు. 116/-లు కన్సొలేషన్ బహుమతి పొందిన కథ!

"తలుపు తెరువమ్మా! బాగా తెల్లారిపోయింది!" గోపీ గొంతులో తొందర, ఆత్రుత! పడుకున్న వాడు, కాస్త మీదకి లేచి, దిళ్ళకానుకొని కూచుందా మనుకున్నాడు-కాళ్ళు పట్టేసి వున్నాయి. నడుము ముందుకి వంగడం లేదు. కాని ఎంతో ప్రయత్నమ్మీద కాస్త మీదకి జరిగి, మూసేసున్న కిటికీ తలుపుకేసి చూసేడు.

"ఎండ బాగా రానీ గోపీ! ఇప్పట్నుంచి తెరుస్తే చలిగాలి కొట్టి జలుబు చేస్తుంది!" ఆ మాటలంటూ అమ్మ బేసిన్‌తో వేణ్ణీళ్ళు స్టూలు మీదుంచి, అందులో నేప్‌కిన్ ముంచి, గోపీ ముఖం తుడిచింది.

"నా కివాళ పాలొద్దు! కాఫీ కావాలి!" ముఖం అయిష్టంగా పెట్టి అన్నాడు.

"వేగం బలం పుంజుకొని, లేచి తిరగాలంటే పాలే తాగాలి!" ఆమె చిరునవ్వుతో అన్నా, ఆ నవ్వు వెనక విషాదరేఖలు-ఉత్సాహంగా ఉండేందుకు చేస్తున్న ప్రయత్నం విఫలం కాగా, ముఖం చాటుచేసుకుంది కళ్ళలోని చెమ్మ కనిపించకుండా.

"అమ్మా! నే వేగం లేచి తిరుగుతాను కదే?" తల్లి చెయ్యి అందుకున్నాడు ఆశగా.

"ఔను గోపీ!"

"మెడిసిన్‌లో సీటు మరెవరికీ ఇవ్వరు కదే!"

"ఇవ్వరు మరెవరికీ! నీ సీటు నీ కోసమనే ఉంచేస్తారు!" గుండె లోతుల్లోంచి దుఃఖం పెల్లుబికి వస్తోంది.

అమ్మ అందించిన పాల గ్లాసందుకుని ఎంతో అయిష్టంగా పాలు తాగేడు- "ఎండ వచ్చేసి ఉంటుంది తలుపు తెరువమ్మా!"

గోపీ మంచం పక్కనేఉన్న కిటికీ తలుపు తెరిచిందామె- చలిగాలి రివ్వున లోనికి దూసుకురాగా గోపీ దగ్గాడు- రగ్గుని మెడ వరకూ కప్పి, "నే చెప్పలేదూ!" అన్నదామె.

ఆమె మందలింపు అతడి చెవిని పడలేదు. కిటికీ తలుపు తెరుచుకోగా ఉత్సాహంగా, బయటి ప్రపంచాన్ని చూసేడు — కిటికీ మంచం నానుకొని తలదగ్గరే ఉంది-మూడో అంతస్థులో ఉన్న ఈ గదిలోంచి కింద రోడ్డూ, జనం, వాహనాలూ స్పష్టంగా కనిపిస్తాయి. కాని అతడి దృష్టి అతని కిటికీకి ఎదురుగా, అవతల వీధిలోని ఆరంతస్థుల భవనంలోని, మూడో అంతస్థులో ఉన్న ఒక నీలంరంగు కిటికీ తలుపు మీద నిలిచిపోయింది-అతడికళ్ళు క్షణకాలం ఆశగా మెరిసేయి కాని ఆ తలుపులు ఇంకా మూసుకొనే ఉండడంవల్ల అతడి ముఖంలో నిరుత్సాహం ప్రస్ఫుటంగా కనిపించింది. నిట్టూర్చి క్రిందికి దృష్టి సారించేడు.

క్రింద నున్న రోడ్డింకా రద్దీ కాలేదు. రేగిన జుత్తు, వాడిన పూలు, నలిగిన చీరతో ఒక యువతి సందులోంచి వచ్చి దీప స్తంభం దగ్గర నిలబడింది. ఖాళీ రిక్షా వచ్చి ఆమె ముందాగింది. అందులో కూర్చొని వెళిపోయింది. అప్పుడే స్నానం చేసేసి, విభూతి పిండికట్లు, తెల్లటి ధోవతి, అంగ వస్త్రం, చేతిలో పంచాంగం కట్టతో శాస్త్రులవారు ఎటో శరవేగంతో వెళ్ళిపోతున్నారు.

ఇంకా తెరుచుకోలేదేం చెప్మా ఆ నీలి తలుపు!? ఆ తలుపు తన ఆనందానికి అడ్డుతెరలా కనిపించింది- తెరుచుకుంటే ఆశ! మూసుకుంటే నిరాశ!

ఆర్నెలలు హాస్పిటల్లో వున్నాక ఆ రోజు తనని ఈ కిటికీ పక్కనే ఇదే మంచం మీద పడుకోపెట్టేరు. ఉదయం ఈ కిటికీ తలుపు అమ్మ తెరిచింది. కిటికీలోంచి ప్రపంచాన్ని గమనిస్తూ ఆ నీలి కిటికీ కేసి చూసేడు - ఆ తలుపు తెరుచుకొని వుంది.


ఆ కిటికీ గుండా, పగలే పున్నమి చంద్రుడు అక్కడ ఉదయించినట్టు ఆమె ముఖం! తనకేసే దీక్షగా చూస్తోంది! తన చూపులు కలియగానే చిరునవ్వు నవ్వింది! అంతే! ఆరు నెలలయి హాస్పిటల్లో అనుభవించిన నరకయాతన జ్ఞాపకాలు మటుమాయమయి. ఒక్కసారిగా ఏదో చెప్పలేని ఉత్సాహం, బతికి తీరాలనే బలవత్తరమైన ఇచ్ఛా పుట్టుకొచ్చాయి!

ఎవరామె!? గిరిజా కళ్యాణంలో కవి, పార్వతి ముఖాన్ని వర్ణిస్తూ పాడిన ఉపమానాలు ఉత్తుత్త కల్లబొల్లి కబుర్లనుకున్నాడు కాని, ఈమెను చూసిన క్షణం అవి నిజమే ననిపించేయి! పదిహేను, పదహారేళ్ళకన్న ఎక్కువ వయసుండని ముఖ కవళికలు — తన గుండె చప్పుడు తన చెవులకి వినిపిస్తోంది.

ఇదివరకెప్పుడూ అతడామెను ఆ కిటికీ దగ్గర చూడనేలేదు! బహుశా అక్కడా కిటికీ ఉందని ఇప్పుడామె ముఖం కనిపించడంవల్లనే గమనించేడేమో!

ఆ పెద్ద చక్రాలవంటి కళ్ళతో తనకేసి చూసి ఒక్కసారిగా పూలు పూసినట్టు చిరునవ్వు నవ్వింది. చెయ్యి వూపింది. "నిన్నే సుమా నేను పలకరిస్తా!" అన్న సంకేతమిస్తూ! ఒక్కసారిగా ప్రపంచం ఎంతో అందంగా, ఆనందమయంగా తోచింది— మరుక్షణం మాయమయింది.

మళ్ళా మధ్యాహ్నం ఆమె ముఖం అక్కడ అగపడింది. చేతులతో సంజ్ఞలు "ఎందుకక్కడ మంచమ్మీద పడుకున్నావు" అని అర్థం వచ్చేలా-





# తలపు

మంధా వెంకటరమణారావు

తను చేతులు దుప్పట్లోంచి తియ్య బోయేడు కాని బాధపెట్టాయి. "జ్వరం నాకు!" అన్న సంజ్ఞ చేసేడు- ఆమె కళ్ళలో ఎంతో సానుభూతి!

ఇంకా ఇవాళ ఆ కిటికీ తలుపులు తెరుచు కోలేదు! ఎందువల్ల? నిరుత్సాహం! గోపీకి నీరసం కమ్మినట్టయింది.

ఆరు నెలలయి మంచమే తన ఇల్లు! మందులు....ఇంజక్షన్లు....రక్తం సీసాలతో తనకి ఎక్కించడాలు! సెలైను...గ్లూకోసూ! ఒంటినిండా సూదులు!

నీరసిస్తున్న ఒళ్ళు.... నరాల పీకు.... కీళ్ళనొప్పి.... జ్వరం....

వార్డులోని పేషెంట్ల మూల్గులు- అమ్మ కళ్ళలోని వాత్సల్య పూరితమైన బాధ-ఐయొడిన్ వాసన- ఎంతవేగం ఈ నరకంనించి విముక్తి దొరుకుతుంది దేవుడా!

"రేపు నిన్ను డిశ్చార్జ్ చేస్తారు గోపీ! మనింటికి వెళ్ళిపోతాం!" అని అమ్మ అన్నప్పుడు ఈ ఖైదునించి స్వేచ్ఛలోకి వెళ్ళిపోతున్నట్టనిపించింది!

కాని అమ్మ ఉత్సాహంగా లేకపోయింది! ఆమె కళ్ళు విచారంతో బరువెక్కి ఉన్నాయి.

"నేను బాగయిపోయేనా అమ్మా?" ఏదో ఆశ! మనసులో ఆనందం! శరీరానికి కొత్త కళ వచ్చినట్టనిపించింది! అస్థిపంజరంలా ఎండిపోయిన ఒంటికి ఈనపుల్లల్లా తగిలున్న చేతులని, హాస్పిటల్ బ్లాంకెట్ లోంచి బయటకు తెచ్చి అమ్మ చేతి వేళ్ళు అందుకున్నాడు.

"బాగయి పోయేవు గోపీ! ఇంటి దగ్గర మరో మూడు నెలలు మంచంమీద విశ్రాంతి తీసుకోవాలి!" ఆమె గోపీ చెయ్యి నిమిరింది- ఆశగా అతడి కళ్ళలోకి చూసింది. గుండెలు పిండే దుఃఖాన్ని దిగమింగి- తియ్యటి నవ్వు ముఖంమీదికి తెచ్చుకోవడం అలవాటు చేసుకుంది.

జ్వరం రాలేదు వారం రోజులయి — టెంపరేచర్ నార్మల్‌కి వచ్చింది. మరి రక్తం ఎక్కించడం మానీసేరు.

ఇంటికి అంబ్యులెన్స్‌లో తెచ్చేరు. స్ట్రెచ్చర్‌లో మీదకు తీసుకవెళ్ళేరు. కిటికీ పక్కని మంచం వేయించింది అమ్మ- "తలుపు తెరుస్తే కింద రోడ్డుమీద దృశ్యాలు చూస్తే కాలం ఇట్టే గడిచిపోతుంది!" అమ్మ ఉత్సాహంగా అంది. తలుపు తెరిచింది బయట ప్రపంచం తనముందు! కాంక్రీటు అరల్లో, పంజరంలో పక్షుల్లా మనుష్యులు- వాళయితే మెట్లెక్కి, దిగి, బయటకు పోగలరు—తనో!

డబల్ డెక్కర్ రూటు బస్సు కిటికీకి దగ్గరగానే ఆగుతుంది-అందులో ఎందరెందరో ఆడ మగా-అరవై జతల బట్టలు- లాల్చీలు, పంట్లాంలు, చీరలు, రవికలు, నగలు, నవ్వులు, ఏడుపులు, డీజిలు వాసన! వారిలో ఎవరికీ తానిక్కడున్నానని తెలీదు, ఒక్క ఆమెకి తప్ప!

ఇంకా తలుపు తెరవలేదేం ఆమె? ఆమెకేమన్నా సుస్తీ చేసిందా? భయం వేసింది! ఏమిటీ బెంగ తనకి ఆమె గురించి? ఆమె ఎవరు, తనెవరు? ఆమె ఎవరో కూడా తనకు తెలీదే?

ఏడు గంటలయింది—కిటికీలోంచి ఎండ గదిలోకి దూసుకొస్తోంది! వెచ్చగా బాగుంది.

అమ్మ వచ్చి ఒంటిని తడిమి ఉలికి పడింది! టెంపరేచర్ తీసింది — ఆమె ముఖం వెలవెలబోయింది! ఇదేం విపరీతం! ఈ పాడురోగం తనకొడుక్కిరాక తనకే వస్తే ఎంత బాగుండును! డాక్టర్‌గారు రావడానికింకా గంట సమయముంది— "బ్రెడ్‌కి వెన్నరాసి తెచ్చాను. తిను బాబూ" గోపీ తల నిమురుతూ అడిగింది— "టోస్టు నీకిష్టంగా?"

"నాకేం తినాలనిపించటం లేదమ్మా ఇవాళ!" ఇంకా ఆ నీలి కిటికీ తలుపు తెరవనందుకు ఆ పిల్లమీద వచ్చిన కోపం అమ్మమీద చూపిస్తున్నాడు!

ఆనాడు మొదటిసారామెతో మూగ సంభాషణ ప్రారంభమయ్యాక ఆ తరువాత గడచిన రోజులలో వాడి మూగభాష ఎన్నో రూపాల్ని ధరించింది! ఆమె ఆ కిటికీ వద్దకు వచ్చే సార్లూ ఎక్కువయేయి.

ఒకనాడు ఆమెని సంజ్ఞాపూర్వకంగా, "మా ఇంటికి రావా?" అంటూ అడిగేడు.

ఆమె వెంటనే తన కాలి ముణుకుకేసి చూపించి మూగ భాషలోనే చెప్పింది- "బాగయిపోతే తప్పక వస్తాను! కాని నువ్వు మా యింటికి రావా?" అని—

"నాకు ఎప్పుడూ జ్వరం! నడవలేను! కోలుకున్నాక వస్తాను!"

తన శల్యావస్థలోని శరీరాన్ని ఆమెచూస్తే భయపడిపోయి మరి తనంటే ఇష్టపడదేమో? తను ఆనాటిలా ఎంతో ఆరోగ్యంగా తయారవాలి! అప్పట్లా పుట్‌బాల్ ఆట ఆడగలగాలి! ఫార్‌వర్డ్‌గా తాను బంతిని డ్రిబ్లింగ్ చేసుకుంటూ తీసుకవెళ్ళి గోల్ కొడితే, ఆ అమ్మాయి తన ప్రావీణ్యం చూసి చప్పట్లు కొట్టాలి!

ఇంతకీ ఆమెకి పుట్‌బాలంటే ఇష్టమా? తనంటే ఇష్టం ఉన్న ఆమెకి, తనాడే ఆటలన్నా తప్పక ఇష్టం ఉంటుంది!

ఆమెకి దమయంతని పేరు పెట్టేడు! నలదమయంతి మెట్రిక్‌లో తెలుగు పోయెట్రీ!

నలదమయంతుల ప్రణయగాథ సఫలమవడానికి హంస ఎలా సాయపడిందో అలానే తమకి సహాయం పడుతున్నదీ తలుపు! ఆమె మనోద్వారం ముందు తను! తన మనోద్వారం ముందామె!

అమ్మకి దమయంతి గురించి చెపుతే? అమ్మ నవ్వదూ? ఇప్పట్నించీ నీ వేంబుద్ధులు అనదూ? అమ్మదృష్టిలో ఆ సుందరిని కించపరచటం అసలిష్టంలేక పోయింది!

మొన్నెందుకో దమయంతి ముఖమ్మీద విచారరేఖలు కనిపించేయి! రోజూ కనపడే

## కొన్ని క్షణాలు

కొన్ని క్షణాలు ఎంత అందమైనవి!
అందమైన క్షణాలు అమరమైనవి!
ఆనందం శాశ్వతం కాదు.
క్షణికం కావటమే దాని గొప్పతనం.
పెదవిని పెదవి తాకిన క్షణంలో
దేహాన్ని చీల్చుకుని వస్తుంది ఆనందం
మనసు ప్రమోదంలో పొరలాడుతుంది.
భౌతిక ప్రపంచపు పొలిమేరలు దాటేస్తుంది
కొన్ని క్షణాలలో ఎంత దుఃఖం!
ఆ క్షణాలూ అంతే అమరమైనవి!

ఒక మాట, ఒక చూపు, ఒక వీడ్కోలు
కడుపుని కోస్తుంది
ఆవేదన సముద్రమై పొంగుతుంది
గుండె ఆవరణలో పరుగులు తీసి
మెదడు గీసిన చెలియలికట్ట దగ్గర
బొట్టుగా నిలుస్తుంది.
అనంతంలోకి రాలిపడిన కన్నీటి చుక్క
జీవిత తత్త్వాన్ని రంగరిస్తుంది

తూర్పున ఉదయించిన సూర్యుడు
అక్కడే వుండిపోతే.... అందమేముంది!
భూమి తనచుట్టూ తాను తిరుగుతూ
అనంతాన్ని క్షణాలుగా విభజిస్తోంది
చీకటి వెలుగుల దాగుడుమూతల్లో
జీవితం పరమార్థాన్ని వెతుక్కుంటోంది.
మెరిసిన సత్యాన్ని నెమరువేసుకుంటోంది.
క్షణాల్ని బంధించి శాశ్వతం చేసుకుంటోంది

చాపని ప్రాణిని, ఆగని వానని తలుచుకో!
అబ్బ, ఎంత విసుగు!
నిన్నటి పరమసత్యం
ఇవేళ నిరర్థకం.
ఎవరో చెప్పిన విలువలకోసం
సిద్ధాంతాలకు నిన్ను ముడివేసుకోకు.
జీవితానందానికి ఉరి తగిలించకు.
చావుపుట్టుకల్ని అంటిపెట్టుకున్న మనిషి
అనంతంలో పరమ పరమాణువు
క్షణాలలో అమరుడు.

—'అరవింద్'

నవ్వులేదామె ముఖమ్మీద! ఏం అలా ఉన్నావ్ అని సన్న చేయగా, పెదవులువిరిచి, విషాదంగా నవ్వి, భుజాలెగరేసింది. ఏం జరుగుతుందో జరగనీ అన్నట్టు! తరవాత తలుపు మూసింది!

అమ్మ వేణ్ణీళ్ళతో వచ్చి, ఒళ్ళంతా కడిగింది, తడిపిన తువ్వాలుతో మరోసారి వేడి ఎంతుందో తీసింది- టెంపరేచర్ ఎక్కువవుతోంది- ఎదురుగా ఉన్న కిటికీకేసి గోపీ చూడ్డం గమనించి "ఏం చూస్తున్నావ్ గోపీ అలా? ఏముందటు? రోజూ తలుపు తెరవగానే ఎంతో సంతోషంగా కనపడేవాడివి. ఇవాళేం అలా వెలవెల బోతున్నావ్?"

"బాగానే వున్నానమ్మా!" ముభావంగా అన్నాడు. తరవాత-

"నా గోపీ వేగం నయమై తిరుగుతాడా డాక్టర్‌గారూ?" ఓ సారడిగింది.

"తిరుగుతాడమ్మా, తిరుగుతాడు! తెల్ల కణాల ఉత్పత్తి అదుపులోకి రాగానే!"

"అదుపులో కొస్తుందంటారా?"

"వస్తుంది. వస్తుంది! వారం వారం రక్తం ఎక్కించాలి! మందులు వాడాలి! గోపీలో ఎంతో ఉత్సాహం ఉరకలు వేస్తోందీమధ్య! అదే కావాలి మనకి!" అంటూ ప్రోత్సాహకరంగా మాట్లాడేదాయన.

ఉదయం తొమ్మిదికాని ఇవాళ డాక్టర్‌గారు రాలేదు.

"టెంపరేచర్ నూటరెండుంది డాక్టర్‌గారూ!" ఆందోళనపడుతూ అమ్మ చెప్పింది.

డాక్టర్‌గారు ఉష్ణోగ్రత తెలుసుకొని ఆశ్చర్యపోయేరు- ఒక ఇంజక్షనిచ్చేరు- "ఏం గోపీ! ఇన్నాళ్ళూ నవ్వుతూ వుండేవాడివి.... ఇవాళ సీరియస్‌గా కూచున్నావ్?" అంటూ చిరునవ్వు నవ్వుతూ అని, "కాస్త జ్వరం వచ్చిందంతే! రేపటికి తగ్గిపోతుంది."

"థాంక్యూ అంకుల్!"

"సాయంత్రం నేను రావడం ఆలస్యం అవొచ్చు. ఓ అమ్మాయికి కాలు ఆపరేషన్ వుంది! బోన్ కేన్సరు! నిన్న రాత్రే హాస్పిటల్‌లో చేర్చేం!" అంటూ డాక్టర్ గోపీ తల్లితో అన్నారు.

ఆ మాటలు విన్న గోపీ డాక్టర్‌ని పిలిచాడు నీరసంగా-

"ఏం గోపీ?" దగ్గరకొచ్చి అడిగాడాయన.

"ఎవరండీ ఆ అమ్మాయి? ఏం పేరు?"

"వాళ్ళదీఊరు కాదు — పైఊర్నించి మూణ్ణెల్లయి వచ్చేరు! అదుగో ఆ మేడలో ఉంటున్నారు!" నీలి కిటికీలున్న ఆ ఎనిమిదంతస్తుల భవనాన్ని చూపించేడాయన!

"ఆ నీలికిటికీ ఉన్న మేడలోనా డాక్టర్‌గారూ" మూసి ఉన్న నీలికిటికీకేసి చూపించేడు గోపీ.




ఆ కిటికీకేసి ఇక్కడ్నించిచూసి, ఆ భవనంలో ఏ గదో సరిగ్గా అంచనా కట్టలేక ఆయన అడిగేడు "ఏం? ఎందుకంత శ్రద్ధ చూపుతున్నావ్? వాళ్ళు మీకు తెలుసాగోపీ?"

"ఆ కిటికీ తెరిచున్నప్పుడు ఆ గదిలో చక్రాల కుర్చీలో తిరుగుతూ ఒకమ్మాయి కనిపించేది! అందుకడిగేను!"

"చక్రాల కుర్చీలలో చాలామందుంటున్నారక్కడ! ఆ మేడలో ఒక అంతస్థంతా నర్సింగ్ హోమ్ ఉంది .... ఈ పిల్లదీ చక్రాల కుర్చీయే అనుకో!"

"ఈమెకు బాగవుతుందా డాక్టర్‌గారూ!" ఆత్రంగా అడిగేడు.

"కష్టం గోపీ! ఆ అమ్మాయి ఎడంకాలు తొడ దగ్గర్నించీ తీసేస్తారివాళ!" విచారంగా ఆయనన్నారు.

గోపీ మనసు అల్లకల్లోల మయింది! ఆ పిల్ల మాత్రం తన దమయంతి కాకూడదనుకున్నాడు!

"ఆమె తెల్లగా వుంటుందా? నాకన్న పెద్దదా చిన్నదా?" వదలకుండా అడిగేడు గోపీ.

గోపీ భుజం మీద తట్టి ఆయనన్నాడు.. "ఆమె గురించి నువ్వెందు కారాటపడాలి గోపీ! ఏం చేస్తాం? మనిషై పుట్టేక రోగాలు తప్పవుకదా?"

"ఫరవాలేదు కదా?" అడిగేడు.

"ఆమె నీ కన్న రెండేళ్ళు చిన్న. తెల్లగానే ఉంటుంది. పేరు గిరిజ! ఎప్పుడూ చిరునవ్వునవ్వుతూ ఎన్నోకబుర్లు చెప్తుంది. తనరోగం గురించీ, బాధ గురించీ తెలియనిచ్చేది కాదు! 'ఎలా ఉన్నావ్?' అంటే, 'అయామ్ ఫైన్ డాక్టర్!' అనేది!" డాక్టర్ తన ధోరణిలో తాను మాట్లాడేడు! అతడి గొంతు ఆర్ద్రతతో నిండింది.

గోపీ మనసు తేలిక పడింది— ఆమె తన దమయంతి ఐ ఉండదు! ఏమో! ఎవరు చెప్పగలరు? ఐనా ఐ ఉండొచ్చు! "కాలు తీసేస్తే ఎలా నడుస్తుంది డాక్టర్‌గారూ?"

"కాళ్ళులేని వాళ్ళెలా నడుస్తున్నారో అలానే!" అన్నారాయన-

మెట్లు దిగుతూ గోపీ తల్లితో డాక్టర్ అన్నారు. "బ్లడ్ రెండు బాటిల్స్ రెడీ చెయ్యండి! అవసరం పడితే రేపు వాడాలి! ఇన్నాళ్ళూ చీర్‌ఫుల్‌గా ఉన్నాడే? ఇవాళేం ఇలా ఐపోయేడు?"

కన్నీరు కారుస్తూ అన్నదామె— "ఏమో డాక్టర్ నాకు తెలీదు! ఇవాళ ఏమీ తినలేదు కూడా! ఏమెచ్చిందో వాడికి."

డాక్టర్ వెళ్ళిపోయేడు—

గోపీ మూసుకొనే ఉన్న ఆ కిటికీ తలుపు తీసి చూస్తూ ఆలోచనలోపడ్డాడు-దమయంతి ఆపరేషన్‌కోసం హాస్పిటల్‌లో ఉందా? ఆమె పేరు గిరిజా? గిరిజే తన దమయంతి ఐతేనో? దమయంతి కాలుపోయినాసరే తనామెను ఆదుకుంటాడు. తాను పెద్ద డాక్టరై దమయంతిని పెళ్ళాడి జీవితాంతం ఆమెకి అండగా నిలుస్తాడు!

కాని దమయంతీ, గిరిజా ఒక్కరే అని ఎలా తెలుస్తుంది? సాయంత్రానికి తెలుస్తుంది డాక్టర్‌గారన్న గిరిజ పరిస్థితి!

ఈ ఆందోళనతో గోపీ జ్వరం ఎక్కువైంది- అమ్మ వచ్చినప్పుడల్లా అడిగేడు... "ఆ పిల్లకి బాగవుతుంది కదమ్మా? మరకాలు పెడితే నడుస్తుంది కదూ?"

ఆమె గోపీకేసి ఆశ్చర్యపోతూ చూసింది. డాక్టర్‌గారా కబురు చెప్పడంవల్ల ఎవరో ఆ తెలీని పిల్లకోసం అనవసరంగా బాధపడుతున్నాడు గోపీ!

"బాగవుతుందిరా! నువ్వింక ఆమె గురించి ఆలోచించబోకు!"

సాయంత్రం డాక్టర్‌గారు ఎనిమిదయితే కాని రాలేదు- ముందు గదిలోనే అతడ్నాపి

# గ్రీష్మ విలాసము

సీ॥ మానవుని దేహమను మేఘమాల నుండి
చెమ్మటల వర్షధారలు చిమ్మజేయు
గ్రీష్మ ఋతు రాజ! నీదు మహోష్మమందు
ప్రాణి సంతతు లారాటపడుట కనుమ!

చేయివేయకు, మేను చెమటపట్టిన దంచు
కోపంబు నటియించు కోమలాంగి.
ముద్దుముచ్చటలేల, ముద్దాయె తనువంచు
చిటపటలాడును చిగురుబోడి.
కౌగిలింతల వింక కట్టిపెట్టుమటంచు
విసనకఱ్ఱల నిచ్చు వినుతశీల,
ఒక తల్పమున నెట్టులొదిగెద మిపుడంచు
చాపనొసంగును సన్నుతాంగి.
రసభరితమైన మగువ మానసమునందు
భావవైరాగ్య మీరీతి పాదుకొల్పి
చిత్తమును, దేహమును మండజేతు వీవు
చిత్తజుని వాడి బాణాలు చిత్తుచేసి!

—ఎం. పి. జానుకవి

అమ్మ ఆత్రంగా అంది.... "గోపీ పరిస్థితి బాగోలేదండీ! అస్తమానం గిరిజ గురించే అడుగుతున్నాడు! ఎలా వుందామెకి?"

"ఆపరేషనయింది! తెలివింకా రాలేదు! నాకేమీ ఆశ లేదు! పూర్ గరల్!"

"ఆ సంగతి వాడి ముందనకండి! బాగుందని చెప్పండి!"


డాక్టర్ గోపీని చూసేరు- మగతగా కళ్ళు మూసుకొని పడుకున్నాడు గోపీ- డాక్టరుగారి చెయ్యి ఒంటిని ముట్టగానే కళ్ళు విప్పి అడిగేడు.... "గిరిజకి ఆపరేషన్ అయిందా? ఎలా వుంది?"

డాక్టర్ ప్రసన్నంగా అన్నారు.. "ఐంది గోపీ! బాగానే వుంది!"

"కాలంతా పోయిందా డాక్టర్ గారూ?"

"పోయింది గోపీ! కాని బాధ లేదు! మర కాలు పెడితే నడుస్తుంది!"

గోపీ క్షణ కాలం ఊరుకొని అన్నాడు...



"గిరిజ నొక్కసారి చూడాలి డాక్టర్ గారూ!"

డాక్టరూ, అమ్మా ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు. అమ్మ అంది.... "ఇప్పుడెవర్నీ చూడనివ్వరు! నువ్వు కోలుకొని బాగయ్యాక చూస్తువుగాని."

"ఔను గోపీ!నువ్వు వర్రీ కాకూడదు!" డాక్టర్‌గారు వంతపాడేరు. "బాగయ్యేక చూద్దువుగాని!"

"ప్రామిస్!" గోపీ అడిగేడు సంతోషంగా.

"ప్రామిస్!" డాక్టర్ గారన్నారు.

ఆ సంతోషంతో రెండు బ్రెడ్ ముక్కలు తిని, పళ్ళరసం తాగేడు.

డాక్టర్ ఇంజక్షనిచ్చేరు నిద్రకి. తరవాత ఆమెని పక్కకి పిలిచి. "రేపు బ్లడ్ ఎక్కించాలి!"

"మళ్ళా హాస్పిటల్లో చేరుస్తేనో?" ఆమె అడిగింది.

"గోపీ స్థితి గురించి మీకు తెలిందే ముంది?హాస్పిటల్‌లో ఉంచినా ఇదే ట్రీట్‌మెంట్! బోన్‌మేరో యొక్క తెల్ల కణాల ఉత్పత్తి తగ్గించాలి! రక్తం ఎక్కిస్తూ వుండాలి. తెల్ల కణాల శాతం ఎక్కువనగానే! ఆ పైన అదృష్టంకే వదిలిపెట్టాలి! అంతకన్నా ఎవరూ చెయ్యగలిగిందేమీ లేదు!"

ఆ రాత్రి గోపీ బాగా నిద్రపోయాడు- మర్నాడుదయమే లేస్తూ తల్లితో అన్నాడు... "కిటికీ తెరువమ్మా! ఎండవచ్చేసినట్టుంది!" -అమ్మ కిటికీ తెరిచింది- ఎదురుగా వున్న మేడలోని కిటికీ మూసే వుంది! ఆ కిటికీ మరి తెరుచుకోదు గిరిజ, అంటే దమయంతి హాస్పిటల్ నుంచి వచ్చే వరకూ! మనసంతా వికలమైపోయింది! ఉత్సాహం మాయమయింది!

అమ్మ పాలు తెచ్చింది- తాగబుద్ధి కాలేదు- బలవంతం చేసి తాగిస్తే వాంతయిపోయింది-

కాళ్ళ నరాలు పీకుతున్నాయి విపరీతంగా- గుండె వేగంగా కొట్టుకుంటోంది- నీరసం ముంచుకొచ్చింది-

డాక్టర్ వచ్చిన సడి అయింది- ముందు గదిలో అమ్మతో.... "పరిస్థితి బాగులేదు!" అన్న మాటలు మెల్లగా చెవిని పడ్డాయి! ఉలికి పడ్డాడు! గిరిజకి బాగోలేదా?

డాక్టర్ తన దగ్గరికి రాగానే అడిగాడు— "గిరిజకి ఎలా ఉంది డాక్టర్‌గారూ?"

"బాగోలేదు గోపీ! తెలివొచ్చి మళ్ళీ పోయింది! కాంప్లికేషన్స్ ఏర్పడ్డాయి!"

గోపీ ముఖం పాలిపోయింది! "గిరిజ బతకదా డాక్టర్‌గారూ?"

"చెప్పలేం గోపీ? చూడు గోపీ! ఆ పిల్ల బతికిమాత్రం ఏం సుఖపడుతుంది? ఆ రోగం రెండో కాలుకి రావచ్చు!" ఉన్న మాట చెప్పేస్తే గోపీ ఆమె గురించి

## రాంచి ఆంధ్ర సమితి రజతోత్సవం

ఏప్రియల్ 10, 17, 24 తేదీలలో ఆంధ్ర సమితి (రాంచి) రజతోత్సవాలు జరుపుకున్నది. మొదటి రోజు స్థానిక మెకాన్ హాలులో నాటకోత్సవాలు జరిగాయి. మూడు నాటకాలతోపాటు సమితి సంయుక్త కార్యదర్శి శ్రీ పడపల వీరభద్రుడు యోగాసనాలు ప్రదర్శించారు. 17 వ తేదీన శ్రీ ఎమ్. వి. నరసింహాచారి, ఎమ్. వసంత లక్ష్మి దంపతుల నృత్య ప్రదర్శన జరిగింది. సమితి అధ్యక్షులు శ్రీ బి. ఎస్. కృష్ణారావు అధ్యక్షతన జరిగిన ముగింపు రోజు కార్యక్రమంలో నాటక రచయిత శ్రీ రావి వెంకటాచలంగారిని, నాట్యావధానం చేసిన శ్రీ ధారా రామనాథశాస్త్రి సోదరులను సమితి సన్మానించింది.

### ఒరిస్సాలో ఉగాది

రాయగడకు చెందిన ప్రగతి సాహితీ సాంస్కృతిక సంస్థ ఉగాదినాడు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించింది. స్థానిక మహిళా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ మోహన

# సమాచారమ్

రావు ముఖ్య వక్తగా, డాక్టర్ చలసాని రాములు ముఖ్య అతిథిగా పాల్గొన్న యీ సమావేశాన్ని సంస్థ కార్యదర్శి శ్రీ అశోక్ కుమార్ నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా యువ కవితా గోష్టి జరిగింది.

### శ్రామిక విద్యాపీఠం

1979 నవంబర్‌లో గుంటూరులో కేంద్ర విద్యాశాఖ ఆర్థిక సహకారంతో ఏర్పడిన యీ సంస్థ నాటినుంచి కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు బహుముఖంగా వయోజన విద్యా కార్యక్రమాలను నిర్వహిస్తున్నది. ఈ విద్యాపీఠం పరిధిలో గుంటూరు, విజయవాడ, తెనాలి, మంగళగిరి, చిలకలూరిపేట వున్నాయి. పీఠం నిర్వహణ కమిటీకి ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖామంత్రి అధ్యక్షులు. అధికార అనధికార ప్రముఖులనేకులు సభ్యులుగా వున్న ఈ పీఠానికి వార్షికంగా 2 లక్షలకు పైగా గ్రాంటు లభిస్తున్నది. ఈ సంస్థ— 1. సాధారణ విద్యా కార్యక్రమాలు 2. కార్మికులకు వారివారి వృత్తులలో నైపుణ్యాభివృద్ధికి శిక్షణ. 3. స్వయం ఉపాధి వృత్తులలో శిక్షణ—ఇంకా అనేక విజ్ఞాన, వినోదాత్మకమైన సినిమాల ప్రదర్శనలను నిర్వహించడం చేస్తున్నదని సంస్థ డైరెక్టర్ శ్రీ ఎన్. లక్ష్మిరెడ్డి తెలియజేస్తున్నారు.

మరిచిపోవచ్చని చెప్పేసేడాయన!

గోపీ బాధగా కళ్లు మూసుకున్నాడు మళ్ళా. ఏం సుఖపడుతుందా? ఆ తలుపు తెరుచుకోగానే ఆమె ముఖం అక్కడ అగపడి ఎంతో జీవంతో నిండిన చిరునవ్వు తనకేసి విసిరేది! ఈ డాక్టర్‌కేంతెలుసు? తను ఆమె సుఖపడేలా చూస్తాడు? గిరిజ బతకాలి. గిరిజ బతుకుతుంది!

కళ్ళు మూతలు పడ్డాయి-నిద్ర ముంచుకొచ్చింది.

కళ్ళు తెరిచేసరికి రక్తం ఒకొక్క బొట్టే పడుతోంది బాటిల్‌లోంచి తనరక్త నాళాల్లోకి. తను కళ్ళు విప్పగానే అమ్మ ఎంతో ఆశగా చిరునవ్వు నవ్వింది-ముఖాన్ని ముట్టుకుంది-వెర్రి తల్లి! తనమీద ఎన్ని ఆశలు పెట్టుకుందో నాన్న పోయినప్పట్నించీ!

"ఎలా ఉంది గోపీ!" ఆమె గొంతులో వణుకు!

గోపీ చిరునవ్వు నవ్వడానికి ప్రయత్నించేడు- కాని గుండెలో ఏదో దిగులు-బతుకుదామన్న ఆశే చచ్చింది!

ఎందుకు బతకాలి తను? ఎప్పుడూ ఈ రక్తం సీసాలు- ఇంజక్షన్లు- గోళీలు- నవ్వలేక నవ్వే డాక్టరి ముఖం- ఏడవలేక నవ్వే అమ్మ జాలి ముఖం, ఆ నీలి తలుపు వెనక ముఖం కూడా మరి కనిపించటం లేదే! తనకి బతుకుమీద ఇష్టాన్ని కలిగించి, బతకాలనిపించకేసే ఆ ముఖం మరి కనిపించక పోతే తను బతికి మాత్రం ఎందుకు?

"బాగుందమ్మా!" అన్నాడు ఎంతో కష్టంమ్మీద-తెలివిపోతున్నా—

డాక్టర్‌గారు వచ్చినట్లు బూట్ల సడి- అమ్మ లేచి అవతలకి వెళ్ళింది— అతనేదో అంటున్నాడు ఎంతో ఆందోళనచెందుతూ— "గోపీ వింటాడు!" అమ్మ అంటోంది!

"పూర్ గరల్! ఆఖరికామె కష్టాలు ఆఖరయ్యేయి!" డాక్టరన్న మాటలు అస్పష్టంగా వినిపించేయి—.

గోపీ ఉలిక్కిపడ్డాడు- గిరిజ మరణించిందా! మనసు ఆరాటపడగా, డాక్టర్‌గారు బెడ్‌దగ్గరకు రాగానే అడిగేడు. "డాక్టర్ గారూ! గిరిజ....?" కళ్ళవెంబడి నీళ్ళు—

డాక్టర్ గ్రహించేడు, గోపీ విన్నాడని- "గిరిజ దేవుడి దగ్గరికి వెళ్ళిపోయింది గోపీ!"

గోపీ నిస్త్రాణగా ఉండిపోయేడు- ఆ కిటికీ తలుపులు మరి తెరుచుకోవు! గిరిజ మరి లేదు— "బాధ పడిందా?" నీరసంగా అడిగేడు—

"ఆమెకి మరి తెలివొస్తేగా? దేవుడిదగ్గర హాయిగా ఉంటుందిగోపీ! నువ్వు మరి బాధ పడకు! ఆమెని దేవతలు ఎంతో ప్రేమగా చూస్తారు!" ఓదార్చేడాయన-

గోపీ కళ్ళ వెంట నీరు ధారలు కట్టి కారసాగింది- మనస్సు పిడుగు పడ్డట్టు మసి అయి మూగబోయింది! తెలివిపోయింది!

గోపీ తల్లి గాభరా పడుతూ అంది.... "డాక్టరు గారూ! గోపీ ముఖం చూడండి! ఎలా వాడిపోయిందో! మీరా పిల్ల సంగతి చెప్పకపోవాల్సింది!"

"చెప్పేయడమే మంచిదమ్మా! ఒక్కసారి బాధపడి మరిచిపోతాడు- నీరసంవల్ల నిద్ర వచ్చేసిందంతే!" అంటూ మరొక రక్తపుసీసా ఒక గంట తరువాత తగిల్చి, మర్నాడు వస్తానంటూ వెళ్ళిపోయేడు-

రాత్రంతా ఆమె గోపీ మంచం పక్కనే కూర్చుంది.

తెలతెలవారుతూ వుండగా కిటికీ తెరిచింది, మంచి గాలికోసం—

గోపీ కళ్ళు మెల్లిగా విప్పేడు- కిటికీలోంచి నీలి తలుపుల కిటికీకేసి చూసేడు- ఆ కిటికీ మూసుకునే వుంది!

అతడి ముఖంమ్మీద తృప్తి! ఒక్కసారి కళ్ళలోనూ ముఖంలోనూ వెలుగు! అంతలోనే చీకటి! ఆ కళ్ళు విచ్చుకున్నవి విచ్చుకున్నట్టే వుండిపోయేయి!

చుక్క- చుక్కలుగా పడుతున్న రక్తం ఒక్కసారిగా ఆగిపోయింది!

"గోపీ! గోపీ! ఏమయింది నీకు! కదలవేం?" ఆమె అతడ్ని కదిపింది. చలనం లేని కట్టె చేతికి తగలడంతో, "గోపీ!" అంటూ కేకపెట్టి స్పృహతప్పి పడిపోయింది.

అదే క్షణంలో ఆ ఎదుటి వీధి మేడలోని నీలి కిటికీ తెరుచుకుంది!

పున్నమినాటి చంద్రోదయంలా అక్కడ ఉదయించింది చంద్రబింబం వంటి ఆ పదిహేనేళ్ళ పిల్ల ముఖం! ఇటుకేసి ఆ అందమైన కళ్ళతో ఆత్రంగా చూస్తూ, చిరునవ్వు నవ్వింది! "నేనీ మధ్య ఊరెళ్ళేను!" అంటూ చేత్తో సన్నలు జేసింది. కాని గోపీ నించి ఏ సన్నా లేకపోగానే ఆమె ముఖంమ్మీద గంభీర ముద్ర! కళ్ళలో బెదురు! "ఏమయింది నీకు? ఏమయింది?" ఆమె సన్న జేస్తూనే వుంది.

గోపీ నించి ఏ సమాధానమూ రాకపోగా, చిరుకోపం తెచ్చుకొని, తలుపు మూసేసింది!

●

